పోలాం పిల్లలు

— మా. గోఖలే

ఎర్రాయి, ఎంకటాముల అమ్మ పోలాం, అయ్య పుల్లాయిలు సీతారావుమ్మగోరింటిపక్క రంగయగోరి తోట కనిపెట్టుకునుంటారు; కాని తోటమీన కొత్త కూత్త గిట్టుంటే అయ్య పక్కింటి సీతారావుమ్మగోరింటో పానిపనికి కుదిర్న అమ్మను కాణీకి అర్ధణా కంటూ పానాలు పీక్కుదినడు.

ఆదినం తెల్లారి లెగిసింది మొదలు అయ్య అదోళ పద్ధతి గుండాడు. ఆవజాన ముసుగేసుకుని గుడిసె గోడ కానుకు కూసుని అమ్మకల్లీ, తమకల్లీ మద్దెమద్దె కోరసూపులు సూత్తాంటం ఎర్రాయి, ఎంకటాములకు వొళ్లంతా దురదగుంటాకు రుద్దినట్టుగుండది.

"ఎర్రాయ్?"

"ఏందే ఎంకటాం?"- సాటుసాటున గుసగుసలాడుకుండారు ఎర్రాయి, ఎంకటాములు.

"ఏందిరా, అయ్య అట్ట కూకుండాడు కదలకండా?" అంది ఎంకటాం.

"అదేమో, యిగ్గహానికిమల్లే అటనే కూకుండాడు-పుగాకు లేదుగావాల్ను." అన్నాడు ఎర్రాయి.

"పుగాకా! ఎదవపుగాకు ఏంతయ్యా లేకపోతే?" అంది ఎంకటాం.

"అదేమ్మాటా-కుతిగా వుండ దెట్టా?" అన్నాడు ఎర్రాయి.

"కుతిగా వుంటే? డబ్బులు యాణ్ణుంచొస్తాయిరా పద్దాకా? ఒరేయ్, నువు పొగాకు తాగావంటే అయ్యతో సెబతా." అంది ఎంకటాం.

"తా-నేనా ఎదవపుగాకూ! ఓపాలి అయ్య అడిగితే లేదన్నాగా!" అన్నాడు ఎర్రాయి.

"ఏందిరా అడిగింది?"

"పుగాకు"

"ఎవుర్ని?"

"నన్నే"

"నిన్నా!"

"ఓ సాయుంటే యిటు బారేయరా-అనడిగాడ్లే"

"ఏంటి!"

"ఆమయిన సంపుతాడేమోనని లేదన్నా."

"నువు తాగుతావంట్రా?"

"ఛీ, ఎదవది! ఓపాలి ఎట్టుండదోనని సూశాలే-నన్నాసిది!"

"ఒరేయ్-అమ్మతో సెప్పనా?"

"నే తాగుతేగా-అట్ట సూసి అటనే పారేత్తినిగా"

"అమ్మ సంపుద్దిరోయ్-"

"మరి అయ్య కిచ్చుద్దే కాణీలు - కొనుక్కోమనీ?" అన్నాడు ఎర్రాయి.

"యీ అయ్య కేం ల్లేపదు; పద్దాకా అమ్మను సంపుతోవుంటాడు" అంది ఎంకటాం.

"ఏమేయ్?" అనరిసి పిలిశాడు అమ్మను అయ్య.

"నిన్నేనేయ్?" అని మల్లీ అరిశాడు అయ్య.

అమ్మ యినుక్కుండది.

"నిన్ను గదంటే?" యింకాత్తె గట్టిగా అరిశాడు అయ్య.

"ఎందుకు అట్టరుసుకుంటావ్?" అంది అమ్మ.

"అయితే నువ్వు ఎల్తానంటావా ఎల్లనంటావా?" అన్నాడు అయ్య.

అప్పటికి కాత్తె ఎండెక్కింది. అయ్యెవారం కాత్తె కాకమీనుంటంజూసి సల్లగా ఎర్రాయిసెయి గిరింది ఎంకటాం. యింకూసేపిట్లో గుడిసెకెనకమూల నారిజసెట్టుకింద యిటికకుప్పసాటుకు సేరి సప్పిడి కాకుండా కూసుండారు ఎర్రాయి, ఎంకటాములు.

అరవమాక మంది ఎంకటాం ఎర్రాయితో.

అరవనన్నాడు ఎర్రాయి ఎంకటాంతో.

గుడిశెలో తుబుక్కున వుమ్మూశాడు అయ్య.

"అయితే, నువ్వు చీతారావుమ్మగోరింటికి పని కెందుకెల్లవే?" అనన్నాడు అయ్య.

"నువ్వు లచ్చకెప్పు నే నెల్లను" అంది అమ్మ.

"అది గందుకనే శెప్పేది.ఎందు కెల్లవ్వా అంట?" అన్నాడు అయ్య.

"ఆరి సబ్బిల్లలన్నీ నేనే పూసుకుండానంట" అంది అమ్మ.

ఎంకటాం ఎర్రాయికల్లి సూత్తే ఎర్రాయి ఎంకటాంకల్లి సూశాడు.

"సబ్బిల్లలూ! సబ్బిల్లలేందే" అన్నాడు అయ్య.

"సబ్బిల్లలేందంటాడేం? ఆరు రుద్దుకునే సబ్బిల్లలన్నీ నేనే రుద్దుకుంటున్నానంట."

"అని ఎవురన్నారూ?" అన్నాడు అయ్య.

"యింకెవ్వురుంటారూ-ఆ చీతారావుమ్మగోరే"

"మరెందుకు రుద్దుకున్నా?" అన్నాడు అయ్య.

"యిదేందియ్యోవ్, నువ్వు ఆయిన్ని ఎనకేసుకొస్తన్నట్టుందే సూత్తే- యిగసాల్లే పూరుకో యియ్యాల్టికి."

"చరే, అట్టనే పూరుకుంటా-అయితే, చీతారావుమ్మగోరు నిజంగా అన్నదంటా?" అన్నాడుఅయ్య.

"అన్నదంటా! ఓ అంట వేంటి- మీన మీన కొచ్చిందిగా!"

మల్లీ తుబుక్కున వుమ్మూశాడు అయ్య.

"అయితే యిప్పు డేందే ను వనేదీ?" అన్నాడు అయ్య కూసేపుండీ.

"నే నెల్ల నాడికి"- యిసిరేసిన ట్టంది అమ్మ.

"తొందరపడ్డావులే" అన్నాడు అయ్య.

"ఎవురు నేనా?"

"ఆ, నువేనే. కాకబోతే పతినెలా రెండు రూపాయలు సేదంటే సీకూ?" అన్నాడు అయ్య.

"యూడుంటదీ- యూడన్నా పుగాకు సేదుగా వుంటదెట్టా?" అంది అమ్మ.

"అదిగందుకే తిక్క రేగుద్ది - నువ్వుగాంగా మా లావు సంపాయించావులే ముండమోపిడబ్బులు." అన్నాడు అయ్య పెటీమని కొట్టినట్టు.

ఎర్రాయి ఎంకటాంకల్లి సూశాడు. ఎర్రాయి శెక్కుగూన్ని ఒక్కగుంజు గుంజింది ఎంకటాం.

"అంత రోసం గలోడివయితే ఎల్లి సంపాయించుకురారాదూ?" అంది అమ్మ.

"అయితే నే సీడ ఎదవనై కూకుండానంటావు?"

"నే నన్లేదయ్యోవ్ అంత లావుమాట! నీకేం మారాజుకుమల్లేనే కూకుండావు." అంది అమ్మ.

"ఆ, కూకుండాలేనే. తోటమీన కాత్తె కల్లొచ్చేత్తే ను వామాట లంటా? మ రారంగయ్యగోరు ఆవజాన నడుపుతుండాడు యవారం."

"మరి ను వావజాన సీలునవ్వుల్తా కూకుంటే యవారం. నడపడెట్టా?" అంది అమ్మ.

"తోట కాత్తె ఎదిగి లాభాన పడ్తే ఏమన్నా యిత్తానంటుంటే యి గామడిసితో ఏంజేత్తా?"

"యింకా ఒకటే ఎదగాల్సిందే యివకాడ డొక్క సీక్కబోతావుంటే. యవారం యిట్టనంటయ్యా వుండాల్సిందీ?" అంది అమ్మ.

"ఆ ఎ వార మేందో నే దెల్సుకుంటా-గానీ యిప్పుడు నీ యవార మేందో ముంగల దేల్చు." అన్నాడు అయ్య.

"నా యవారం నీ యవార మేందంటా?"

"ఏందేందే! గొప్పోర్లో నువ్వా నే నంటే తిరగ బడాల్సిందే? అన లట్టయితే ఎట్టానంటా?" అన్నాడు అయ్య.

"సితత్వా లేందో తెలవటం లేదుగాని, అన లామడ్సి మాటిమాటి కావజాన సేతులు తిప్పద్ది, దేని కంటా?"

"సేతులు తిప్పట మేందే" అన్నాడు అయ్య.

"మ రదేందో సబ్బులంటా సేతులు తిప్పద్ది!"

"ఎవురూ?" అన్నాడు అయ్య.

"ఆ చీతారావుమ్మగోరే!" అంది అమ్మ.

"అదిగదే వొద్దన్నా" అన్నాడు అయ్య.

"ఏంది వొద్దన్నా" అంది అమ్మ.

"యిట్టాటియన్నీ తోసేసుకు తిరగాల్సిందే" అన్నాడు అయ్య.

"ఎల్లి నువ్వు నిలబడు అయిడముంగల"

"ఆ, నిలబడాల్సిందే"

"నువ్వు లచ్చ సెప్పు"

"సెప్పిన ట్టేను"

"మరి సబ్బిల్ల లంటంటే-"

"ఏహే అంటే అందిలే"

"అమాటఎందుగ్గాను రావాల్సొచ్చిందంటా?"

"రాగాలు తీయమాక—"

"నువ్వు తియడంలా—"

"నేనా- పోఘ్యాృత్తయి-"

ఆవజాన కళాసి గొట్టినట్టు ఎడాపెడా అయ్యా, అమ్మలమద్దె దుమ్ము లైగిసేతలికి చెడిసి లెగిసి రాత్తా పక్క సింతసెట్టుకిందికొచ్చి కూకున్న ఎర్రాయి, ఎంకటాములకు సీతారావుమ్మగోరియింటి ముంగలకు ఓ మనగాడి తెల్లగుర్రాంబండి ఎగురుకుంటా వచ్చి నిలబట్టం అగుపిచ్చద్ది.

"అర్కే- రాం కిట్టయ్య గోరు-!" అన్నాడు ఎర్రాయి లెగుస్తా.

"ఏ రాంకిట్టయ్యగోర్రా?" అనడిగింది ఎంకటాం తనూ ఎర్రాయితో లెగుస్తా.

"ఏహే, చీతారావుమ్మగోరి అల్లుళ్ళే. తనదియ్య—చుందరమ్మ పంట పండింది!"

"ఎందుకురా పంట పండిందీ-?" అనంటుండా యినిపిచ్చుకోకుండా ఎంకటాం రెక్క బట్టుకుని గబ గబ బండికాడికి లాగాడు ఎర్రాయి.

రాంకిట్టయ్యకల్లీ, రాంకిట్టయ్య ఎక్కొచ్చిన బండీ, బండిసాయీబు ఎర్రగళ్ళలుంగీ, నల్లగడ్డాంకల్లీ కిందనించి మైదాకా ఆవజాన ఓసూపు జూసి, ఎంకటాం సెయిబట్టుకు తెల్లగుర్రం సుట్టూతా ఎర్రాయి ఓ సెక్రం తిరిగేతలికి సారగలోకాన్నించి ఎగ్గిర్దాకిన ట్టొచ్చి సెంబునీలతో కాలకడా లాడిస్తా వాకిట్లోకొచ్చి నిలబడ్డది సీతారావుమ్మగోరు.

సాయిబును టంకుపెట్టె లోనకు పట్టుకురామంటా బూడుసులు టక్‌టక్ కొట్టుకుంటా కెడ్డికి మల్లే సీతారావుమ్మగోరింటోకి నడిశాడు రాంకిట్టయ్య.

"పాపం-మాయింటోనే భోంచేసి వెళ్ళేం?" అని పెద్దగా అంటున్నది సీతారావుమ్మగోరు సంబరంగా.

"సూ శా వం టే?" అన్నట్టు సూశాడు ఎర్రాయి, ఎంకటాంకల్లి. ఎంకటాం సీతారావుమ్మ గోరికల్లి సూసింది. సీతారావుమ్మగోరు గబిక్కన సూసింది ఎర్రాయి, ఎంకటాముల కల్లి—బూబు పగిలి ఆ డేందో లెగిసినట్టు.

"ఆ ముం డేదీ-నాయన్నాయన! కాస్త ఒక్కసారి యిట్లా వొచ్చి పొండీ, ఏమన్నా యింత తునక చేతిలో పెత్తా-దేవుడు పంపిన ట్టొచ్చారు నాయన-అరవకుండా దొడ్లోకి రండేం-" అంటా లోనకి నడిసింది సీతారావుమ్మగోరు నవ్వుతా.

ఇంకాసేపటికి సీతారావమ్మగోరి దొడ్లో కరేపచెట్టుకింద అంటగిన్నెలమధ్యన - గొబ్బెమ్మలకి మల్లే-కూకుండారు ఎర్రాయి ఎంకటాములు.

టకటకటక మట్టెలు కొట్టుకుంటా పావురాయికి మల్లే ఎగురుకుంటా మద్దెగదిలోంచి దొడ్లో కొచ్చి వాకిళ్ళపాలి పక్కన చెయిబెట్టుకు నిలబడి వొంటింటోకి లగెత్తికెల్లింది సుందరమ్మ.

"యిహి-"అంటా మనికట్టుతో ముక్కు ఎగదోసుకుండాడు ఎర్రాయి.

"ఎందుకురా అట్టా ఎగబీల్చుకుంటా నవ్వుతావ్?" అంది సుందరమ్మదాకుడుకు దిమ్మరబోయిన ఎంకటాం.

"తనదియ్య, బలేదిగదంటు సుందరమ్మా-"

"గట్టిగా అరవమాకరా సచ్చినోడా-"

"ఆ సాయిబు వెళ్ళాక్కట్టే-పాపం ఆయనకి ఏం కావాలో కాస్త చూస్తుండరాదుటే- వెళ్ళవే చచ్చిందానా-" అని కాస్త పెద్దగా, కాస్త సిన్నగా అంటున్నది వొంటింటో సీతారావమ్మగోరు.

"గాలెలు జేత్తుండదేవ్-" అన్నాడు ఎర్రాయి నావన పిలుస్తా.

"యూడా పొప్ప దుబ్బలేదే-" అంది ఎంకటాం.

"మరేందబ్బా సుయ్ మనిపిత్తుండదీ-పాకోడీ లెట్టా? నాలుగన్నా పెట్టద్దో లేదో-"

"ఒరేయ్, అంతాశ వుండగూడదురా?"

"పోనీ, రెండన్నా పెట్టదంటా?"

"తోమూడుట్రా అంట్లూ-కాసిని సిల్లు తోడి పెట్టమా అతోట్లల్లోకి, బిందెల్లోకి. కడవ భావిలో పడేసి చచ్చేరు- నాయన్నాయన! కాస్త యీ నాలుగు బిందెలూ కడవాకూడా తోమిపెట్టమా అల్లరిచేయకుండా?" అంటూ సెక్రండిరిగినట్టు వొచ్చి ఎల్లిపోయింది సీతారావమ్మగోరు.

"ఏందిరా సూత్తుండావ్రా-ఒరేయ్ - ఒరేయ్-" అంది ఎంకటాం మద్దెగది అతలగదేపు మెడజాపి సూత్తుండ ఎర్రాయికల్లి యింతగా సూస్తా.

"ఎహా అరవమాకే-"

"ఏందిరా-ఏందిరా-!" కాత్త ఎర్రాయికాడికి జరిగి తనూ అట్ట మెడ జాపిందో లేదో ఎంకటాం— ఎన్నెముకవెంబడ ముల్లుగర్రతో పొడిసినట్టు టకీమంటా ఎంకటామును తోసుకుంటా యిరుసుకు యివకాడ పడ్డాడు ఎర్రాయి.

"అమ్మ! సత్తిన్రో రెర్రాయ్-" అంది ఎంకటాం వుక్కిరిబిక్కిరవుతా.

"అరవమాకే తల్లా-" లెగిసి ఎంకటామును గట్టిగా వాటేసుకుండాడు ఎర్రాయి.

"ఎహె, అరవక్లే యిడూ- ఏందిరా నువ్వు గదికాడ సూత్తుండదీ?"

"ఆళ్ళే-అల్లు-"

"ఎవ్రురా!"

"రాంకిట్టయ్యా-సుందరమ్మా-"

"ఆఁ!-"

"సెయి లటిక్కన పట్టుకుండాడు!"

"ఎవుర్ది!-"

"సుందరమ్మదే!-"

"ఓరయ్యో-"

"అదేమయిన గుంజుకుంటుండది సుందరమ్మ!-"

"అమ్మబుల్లో!-"

"ఒరేయ్ పిల్లలూ, సిల్లు తోడారట్రా-అయ్యో అయ్యో! నే నేంకేతునూ పక్షి మొహాలూ మీరూ- మా నాయనగదూ, మాఅమ్మగదూ, దబ్బున తోడి పెట్టరూ?" అంటూ కలుపుకాడి కొచ్చి జూసి పిండి మరన పడ్డట్టయి-అటనే లోనకి గిరుక్కున మల్లింది సీతారావమ్మగోరు పాకోడీలకాడికి.

మిట్టమద్దానం పొద్దు నిటారుగ నిలబడేయాలకు గుప్పిట్లు మూసుకుని గబగబ లగెత్తుకుంటా సీతారావమ్మగోరింటోంచి వొచ్చి తోటపెండెంగోడ మొత్తకాడ నిలబడ్డారు ఎర్రాయి, ఎంకటాములు.

యిచ్చిందంటే?"

"యియలేదురా-నీ కిచ్చిందంట్రా?"

"అవ్, నా కిచ్చిందిగా!"

"పానిలేరా-ఒరేయ్, కాణితో పుగాకు కొనుక్కుంటావంట్రా?"

"కాణీ నాదమ్మోవ్-"

సప్పున పెండెంగోడ కవకాణ్ణుంచి అమ్మ తలకాయ బెయిటికొచ్చి, గబిక్కున ఎర్రాయి, ఎంకటాములను తోట్లో గుడిసెలోనకి మళ్ళేసు కెల్లింది.

"ఏందిరా మీకు చీతారావుమ్మగోరిచ్చింకే, సూపియ్యండి-పాకోడీలంట్రా-" అంటా ఎర్రాయి ఎంకటాముల గుప్పిట్లు తరీచ్చ జేస్తుండది అమ్మ.

"ఆడికాడ కాణీ వుండది-యిటు బారెయరా, కాణీ-" అంటుండాడు అయ్య.

"కాణీ! ఏకీ కాణీ-"- అంటుండది అమ్మ.

"ఆడికి చీతారావుమ్మగోరు కాణీ యిచ్చింది- జాంసెట్టెక్కి- నే జూశా" అంటుండాడు అయ్య.

"జాంసెట్టెక్కావ్రా! ఎందు కెక్కావ్-వుండాడ- ఏదిరా కాణీ?" అంటుండది అమ్మ.



"సప్పున పెండెంగోడ కవకాణ్ణుంచి అమ్మతలకాయ బెయిటికొచ్చి..."

పడి దొల్లుకుంటా దొల్లుకుంటా గుడిసెమూల సీకట్లో ఎల్తుండది. ఎంకటాం ఎర్రాయిసెయి బరబర బరికిందో లేదో- పాకోడీ, పెడికిట్లు బిగిచ్చుకుంటా వుండేల్బద్దగుం డొదిల్నట్టు బయ్యన తోటమూల మల్లెపొదల సాటు కెల్లి మాయమయ్యారు ఎర్రాయి, ఎంకటాములు.